నేడు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు

అద్దంకి రూరల్: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించనున్నట్లు కార్యలయ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమాల్లో నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి పాల్గొననున్నట్లు , కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

కౌన్సిలర్‌ను సస్పెండ్ చేసే వరకు కౌన్సిల్ నిర్వహించం


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ శ్రీనివాసరావు

చీరాల: కౌన్సిల్‌ను.. అలానే ప్రథమ పౌరుడి కుర్చీని అవహేళన చేసిన టీడీపీ కౌన్సిలర్‌ను సస్పెండ్ చేసేవరకు ఎంత కాలమైనా మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించమని చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం సభ వాయిదా అనంతరం ఆయన తన చాంబర్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కౌన్సిలర్ సత్యానందం తీరు ముందు నుంచి వివాదాస్పదంగా ఉందని, గతంలో ఆయన చైర్మన్ పోడియం వద్ద అజెండా కాపీని చించి చైర్మన్‌పై విసిరివేశాడన్నారు. ఆ ఘటనలో మూడు నెలల పాటు సస్పెండ్‌కు గురయ్యాడని తెలిపారు. అయినా అతనిలో మార్పు రాలేదని, కౌన్సిల్ సమావేశంలో మురుగు కాలువలలో మట్టి తీసే విషయంలో చర్చ జరుగుతుండగా జోక్యం చేసుకొని అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడి కౌన్సిలర్ల ద్వారా చైర్మన్‌గా ఎన్నికైన తనను, తన కుర్చీని అవహేళన చేయడం బాధించిందన్నారు. ఈ విషయంపై కమిషనర్, మున్సిపల్ శాఖ మంత్రి, సీఎం ఇతర అధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, శిఖాకొల్లి రామసుబ్బులు, కౌన్సిలర్లు ఎం రాములు, గోలి జగదీష్, గుంటూరు ప్రభాకరరావు, కంపా అరుణ్, కీర్తి వెంకట్రావు, బత్తుల అనిల్, కో–ఆప్షన్ సభ్యురాలు నాగజ్యోతి పాల్గొన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత

అద్దంకి రూరల్: బూచేపల్లి సుబ్బారెడ్డి, వెంకాయమ్మ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో బీవీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని తిమ్మాయపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు 164 మందికి స్టడీ మెటీరియల్, ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్త ఆశలతో.. నూతన ఏడాదికి స్వాగతం


చీరాలలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న వివిధ రకాల కేకులు


చీరాలలోని బేకరీలో సిద్ధంగా ఉన్న కేకులు



మార్టూరులో సందడిగా ఉన్న స్వీట్ షాపు


అద్దంకిలో కేకులు, స్వీట్లు కొనుగోలు చేస్తున్న ప్రజలు

చీరాల అర్బన్: కొత్త సంవత్సరానికి సరికొత్తగా స్వాగతం పలికేందుకు చీరాల పట్టణంలో వేడుక వాతావరణం సిద్ధమైంది. న్యూ ఇయర్–2025 వేడుకలను నిర్వహించేందుకు వాడవాడలా ఏర్పాట్లు జరుగుతున్నాయి. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు ఇంటి ముందు అందమైన రంగవల్లులు కనిపించనున్నాయి. పట్టణంలోని దర్బార్ రోడ్, పాలిమేరరోడ్, కొట్లబజారు, గడియార స్తంభం సెంటర్, బస్టాండ్ సెంటర్లలో స్వీట్లు, కేక్స్ షాపులు ఏర్పాటు చేశారు. నూతన సంవత్సరానికి వివిధ రకాల మోడళ్లలో కేకులను సిద్ధం చేశారు. కేకుల తయారీదారులు సరికొత్త ఆఫర్లు ఏర్పాటు చేశారు. కూల్ కేక్ కొనుగోలుపై కూల్‌డ్రింక్ ఫ్రీ అంటూ ముందస్తుగానే ప్రచారాన్ని చేస్తున్నారు. నూతన ఏడాదిలో తొలిరోజును సరికొత్తగా ప్రారంభించేందుకు ఇష్ట దైవాన్ని ప్రార్థించి పూజలు నిర్వహించనున్నారు. అలానే క్రైస్తవ మందిరాలను విద్యుత్‌దీపాలతో అలంకరించారు. క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి పండుగులు వరుసగా ఉండడంతో పలు వస్త్ర దుకాణాలలో కూడా ప్రత్యేక ఆఫర్లు ఇస్తున్నారు.

మార్టూరులో...

మార్టూరు: న్యూ ఇయర్ సందర్భంగా మార్టూరులోని బేకరీలు, స్వీట్స్ షాపులు వినియోగదారులతో కిక్కిరిసి పోయాయి. దుకాణాల్లో అన్ని రాజకీయ పార్టీల పేర్లతో కూడిన కేకులను తయారు చేసి విక్రయించటం ప్రత్యేక ఆకర్షణగా కనిపించాయి.


కారంచేడులో అమ్మకానికి సిద్ధంగా ఉన్న మిఠాయిల దుకాణం


మార్టూరులో స్వీట్లు కొనుగోలు చేస్తున్న యువత

పింఛన్‌లు సకాలంలో అందాలనేదే లక్ష్యం


పింఛను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

చినగంజాం: పింఛన్లలను లబ్ధిదారులకు సకాలంలో అందించాలనే లక్ష్యంతో పంపిణీని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఏ శ్రీనివాసమూర్తి తెలిపారు. బుధవారం సెలవు కావడంతో మండలంలోని పింఛను లబ్ధిదారులకు మంగళవారం పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంపీడీఓ మండలంలోని కడవకుదురు, మున్నంవారిపాలెం, కొత్తపాలెం, రాజుబంగారుపాలెం, చినగంజాం పంచాయతీలలో పర్యటించి లబ్ధిదారులకు పింఛను అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శులు పీ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభ్యుదయ కవులు దాశరథి, ఆవంత్స

అద్దంకి రూరల్: దాశరథి, ఆవంత్స సోమసుందర్ అభ్యుదయ కవులని రచయితలు కే అనిల కుమారసూరి, రచయిత్రి పాలపర్తి జ్యోతి కొనియాడారు. మంగళవారం రాత్రి స్థానిక కమతేశ్వరస్వామి దేవస్థానంలో సృజన సాహిత్య సమావేశం నిర్వహించారు. దీనిలో భాగంగా దాశరథి కృష్ణమాచార్య, ఆవంత్స సోమసుందర్ శత జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కవులు మాట్లాడుతూ దాశరథి రచనలు అసమాన సౌందర్యంతో ప్రకాశిస్తాయని, సోమసుందర్ కవిత్వంతో నైజాం నవాబులపై గళమెత్తారన్నారు. ఇరువురు కవుల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్వీ రాఘవరావు, యు. దేవపాలన, డీవీఎం సత్యనారాయణ, గాడేపల్లి దివాకరదత్తు, వీరవల్లి సుబ్బారావు, జ్యోతి చంద్రమౌళి, మారం కోటేశ్వరరావు, రావూరి రంగయ్య, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, చప్పిడి వీరయ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కవయిత్రి

బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు



కార్యాలయంలో మాట్లాడుతున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్

పర్చూరు (చినగంజాం): జిల్లాలో బెల్టుషాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీ దేవదత్తు హెచ్చరించారు. మద్యం దుకాణాల్లో అధిక ధరలకు విక్రయిస్తుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. మంగళవారం ఆయన పర్చూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఉన్న మద్యం షాపుల లైసెన్స్‌దారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం షాపుల్లో విక్రయాలు లైసెన్స్ నిబంధనల మేరకే జరపాలన్నారు. ఏ విధమైన తేడాలు ఉన్న నిర్దాక్షిణ్యంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం పర్చూరు ఎక్సైజ్ స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాల గురించి సీఐ భుజంగరావుని అడిగి తెలుసుకున్నారు. నమోదైన 149 కేసుల్లో 151 మందిని అరెస్ట్ తేసి వారి వద్ద నుంచి 2063 మద్యం సీసాలు 269 బీరు సీసాలుతోపాటు 8 వాహనాలు సీజ్ చేసినట్లు సీఐ జిల్లా అధికారులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపర్నిండెంట్ బీ వెంకటేశ్వర్లు, పర్చూరు ఎక్సైజ్ సీఐ ఎం భుజంగరావు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణలో అవకతవకలు అరికట్టండి

బల్లికురవ: ఎస్సీ వర్గీకరణపై గ్రామ సచివాలయంలో ప్రదర్శించిన జాబితాల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నాగయ్య మాదిగ అన్నారు. మంగళవారం బల్లికురవలో తహశీల్దార్ రవినాయక్‌కు వినతి పత్రం అందజేశారు. వర్గీకరణలో జరిగిన పొరబాట్లను అధికారులు సరిచేయాలని కోరారు.

చీరలు పంపిణీ


చీరలు పంపిణీ చేస్తున్న అనిల్‌కుమార్

చీరాల రూరల్: నిరుపేద మహిళలకు దాతలు చీరలు పంపిణీ చేశారు. పద్మభాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘంటా భాస్కరరావు, పద్మావతిల జ్ఞాపకార్థం ఫౌండేషన్ చైర్మన్ ఘంటా అనిల్ కుమార్ మంగళవారం రోశయ్య కాలనీ శివారు ప్రాంత పొలాల్లో నివాసముంటున్న 30 మంది యానాది సామాజిక వర్గానికి చెందిన నిరుపేద మహిళలకు చీరలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారని వారిని తనవంతుగా ఆదుకోవాలనే సంకల్పంతో సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా చిరుసాయం అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పద్మ, జ్యోష్ణ, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

బల్లికురవ: మిరప, బొప్పాయి తోటలు పూత పిందె దశలో ఉన్నాయని.. నత్రజని ఎరువుల వాడకాన్ని తగ్గించాలని మార్టూరు ఉద్యాన శాఖాధికారి బీ. హనుమంతనాయక్ కోరారు. మండలంలోని ముక్తేశ్వరం, సంతమాగులూరు మండలంలోని మక్కెనవారిపాలెం గ్రామాల్లో మిరప బొప్పాయి తోటలను ఆయన పరిశీలించారు. 13–0–45, 0–52–34 ఎరువులు పైపాటుగా వేసుకోవాలని, తక్కువ సాంద్రత ఉన్న పురుగు మందులు వాడుతూ మిరప పొలంలో పసుపు, నీలం, తెలుపు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. బొప్పాయి కాయ తీపితోపాటు ఎగుదలకు బోరాన్ వంటి సూక్ష్మధాతువులు వాడాలని హెచ్‌వో వివరించారు.


రైతులకు సూచనలిస్తున్న ఉద్యానశాఖ అధికారి

యువతి ఆత్మహత్యాయత్నం

చీరాల: ఆర్టీసీ బస్టాండ్‌లో ఓయువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మంగళవారం జరిగింది. అందిన వివరాల మేరకు.. చినగంజాంకు చెందిన యువతి తండ్రి కొంత కాలం క్రితం మరణించాడు. తల్లి కుటుంబ పోషణ నిమిత్తం హైదరాబాద్‌లో ఓ ఇంట్లో పనిచేస్తుంది. యువతి ఇంటర్మీడియట్ చదువుతూ చినగంజాంలోని బంధవులు ఇంట్లో ఉంటోంది. అయితే ఆమెను హైదరాబాద్ తీసుకెళ్లేందుకు తల్లి చీరాల వస్తున్నట్లు బంధువులకు తెలిపింది. దీంతో ఆమెను చీరాల బస్టాండ్ వద్ద వదిలి వెళ్లారు. హైదరాబాద్‌కు వెళ్లేందుకు ఇష్టం లేని ఆ యువతి తనతో తెచ్చుకున్న పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనను చూసిన వారు చికిత్స నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆమెకు ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలిపారు.

లాంగ్‌జంప్‌లో ఉపాధ్యాయుడికి బంగారు పతకం


ఉదయ భాస్కర్‌రెడ్డిని అభినందిస్తున్న హెచ్ఎం, ఎంఈఓ

పర్చూరు (చినగంజాం): గుంటూరులో ఇటీవల నిర్వహించిన 6వ రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్–45 ప్లస్ విభాగంలో చెరుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న డాక్టర్ ఉదయ భాస్కర్‌రెడ్డి బంగారు పతకాన్ని గెలుచుకున్నారు. దాంతో పాటు 110 మీటర్ల హార్డిల్స్ పరుగు పందెంలో వెండి పతకం, 200 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకాన్ని గెలుచుకున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం స్థానిక వైబర్ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో వెంకటరామయ్య, హెచ్ఎం ఈదర రాజశేఖర్ ఉదయ భాస్కర్‌రెడ్డిని శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించారు. కేరళలో నిర్వహించే జాతీయ అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరచి పాఠశాల పేరు నిలబెట్టాలని వారు కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కే సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు 2025 HAPPY NEW YEAR



మృతదేహం వెతికించాలంటూ బంధువుల ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న బంధువులు

అద్దంకి: నదిలో దూకిన భార్య మృతదేహాన్ని వెతికి ఇవ్వడం లేదంటూ బంధువులు రహదారిపై ధర్నా నిర్వహించారు. తన భార్య గుండ్లకమ్మ బ్రిడ్జిపై నుంచి దూకి మూడు రోజులు గడిచినా మృతదేహం లభించలేదంటూ ఆమె భర్త అంజయ్య, బంధువులు మంగళవారం గుండ్లకమ్మ బ్రిడ్జికి దిగువన (అద్దంకి-దర్శి) రహదారిపై 40 నిముషాల పాటు ధర్నా నిర్వహించారు. పెద్ద ఎత్తున వాహనాలు భారీగా అటు అద్దంకి వెంప ఇటు తిమ్మాయపాలెం వైపు నిలిచి పోవడంతో విషయం తెలుసుకున్న సీఐ కృష్ణయ్య అక్కడకు చేరుకుని వారితో మాట్లాడి పంపారు. అనంతరం ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. ఈవిషయమై సీఐ మాట్లాడుతూ మృతదేహం కోసం తాము, ఫైర్ సిబ్బంది నిరంతరం వెతుకుతూనే ఉన్నామని, మూడు పడవలతో గాలిస్తున్నామని చెప్పారు. దొరకగానే మృతదేహాన్ని బంధువులకు అప్పగించనున్నట్లు చెప్పారు.

నేడు రాష్ట్రస్థాయి పోలురాధా ఎడ్ల పోటీలు

చీరాల టౌన్: 2025 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మండలంలోని బోయినవారిపాలెం గ్రామంలో శ్రీకృష్ణ యాదవ్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రస్థాయి పోల్‌రాధా ఎడ్ల పోటీలు నిర్వహిస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. రాష్ట్రస్థాయి పోల్‌రాధా ఎడ్ల పోటీల్లో పాల్గొనే ఎడ్ల యజమానులు రూ.500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పోటీల్లో విజయం సాధించిన ఎడ్ల యాజమానులకు మొదటి బహుమతిగా రూ.20 వేలు, రెండో బహుమతిగా రూ.15 వేలు, మూడో బహుమతిగా రూ.10 వేలు, నాలుగో బహుమతిగా రూ.7 వేలు, ఐదో బహుమతిగా రూ.5 వేలు అందిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. 89777 72429, 95051 02794 సంప్రదించాలని సూచించారు.

లారీ ఢీకొని మహిళ మృతి

అద్దంకి: మహిళను లారీ ఢీకొట్టిన ఘటనలో మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈఘటన పట్టణంలోని అద్దంకి బస్టాండు ఎదురుగా మంగళవారం జరిగింది. అందిన వివరాల మేరకు.. వెంపరాలకు చెందిన వజ్జా రమ (45) పని మీద అద్దంకి పట్టణం వచ్చింది. ఈక్రమంలో ఆమె బస్టాండు వద్ద రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొట్టింది. ఈఘటనలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది ఆమెను తొలుత అద్దంకి వైద్యశాలకు, తరువాత ఒంగోలు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది.























